ప్రజాశక్తి
గురువారం 23 నవంబరు 2023
5
శ్రీకాకుళం




కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్ : పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లోని డయాలసిస్ యూనిట్‌లో పలు కేటగిరీల్లో ఏడు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. డయాలసిస్ టెక్నీషియన్ 5, సీరం టెక్నీషియన్ రెండు పోస్టులకు గానూ దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. టెక్నీషియన్ పోస్టుకు డయాలసిస్ కోర్సులో డిప్లమో పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. సీరం టెక్నీషియన్ ఉద్యోగానికి డిఎంఐటి కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఎపి పిఎంబిలో గానీ ఎపి ఎహెచ్‌సిపి కౌన్సిల్‌లో గానీ రిజిస్ట్రేషన్ పొంది ఉండాలని స్పష్టం చేశారు. ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తులను జిజిహెచ్ సూపరెంటెండెంట్ కార్యాలయ పనివేళల్లో అందజేయాలని సూచించారు. ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు.

భరోసా సొమ్ములు ఎప్పుడు?

- బటన్ నొక్కి 15 రోజులు
- చాలామందికి ఖాతాల్లో జమ కాని నగదు
- రైతుభరోసా కోసం ఎదురుచూపులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు



బటన్ నొక్కి 15 రోజులు గడిచినా చాలామంది రైతులకు నేటికీ రైతుభరోసా డబ్బులు జమ కాలేదు. రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడతల వారీగా డబ్బులు చెల్లిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఏడాదికి రూ.ఆరు వేల సాయాన్ని మూడు విడతలుగా అందిస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500ను మూడు విడతలుగా అందిస్తోంది. రెండో విడత కింద ఇవ్వాల్సిన సొమ్ముల్లో కేంద్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన రైతుల ఖాతాల్లో డబ్బులు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించినా, ఇప్పటివరకు ఖాతాల్లో జమ కాలేదు. పంట కోతలకు డబ్బులు కావాల్సి ఉండడంతో, డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి

జిల్లావ్యాప్తంగా సుమారు 3,21,854 మంది రైతులకు రూ.132.41 కోట్లను రైతు భరోసా కింద జమ చేయాల్సి ఉంది. రైతు భరోసా వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉండడంతో ఎంతమందికి వచ్చింది, ఎవరికి రాలేదనే సమాచారం అధికారులకూ తెలియడం లేదు. గ్రామాల్లో మాత్రం అత్యధిక మంది రైతులు తమకు పిఎం కిసాన్ డబ్బులు వచ్చాయని, రైతు భరోసా సొమ్ములు రాలేదంటూ చెప్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేసిన వెంటనే నాలుగైదు రోజుల్లోనే 70, 80 శాతం రైతుల ఖాతాలకు నగదు జమయ్యేది. ఈసారి పది రోజులు గడిచినా ఇప్పటికీ రైతు భరోసా జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల చుట్టూ తిరుగుతూ రైతు భరోసా ఎప్పుడు వస్తుందని, అసలు తమకు వస్తుందా? లేదా? అని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు.

రైతు భరోసా సొమ్ములంటూ ప్రచారం

రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందిస్తున్న రూ.7,500లో మొదటి విడతగా ఖరీఫ్ ఖర్చుల కోసం రూ.5,500 అందిస్తోంది.

పంట కోతలు, రబీ అవసరాల కోసం అక్టోబరులో రూ.రెండు వేలు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఈ డబ్బులే రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఇదే సమయంలో పిఎం కిసాన్ డబ్బులు పడుతుండడంతో అవే రైతు భరోసా డబ్బులు అంటూ గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, సిబ్బంది ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. పిఎం కిసాన్ డబ్బులకు సంబంధించి రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నా వారికి అవగాహన లేకపోవడంతో, నిజమే కాబోలు అంటూ నమ్ముతున్న పరిస్థితి నెలకొంది.

డబ్బులు జమ అవుతున్నాయి

రైతు భరోసా డబ్బులు 90 శాతం మందికి జమయ్యాయి. బ్యాంకు అకౌంట్, ఆధార్ లింక్ వంటి సమస్యల వల్ల కొందరికి డబ్బులు రాలేదని తెలుస్తోంది. వీటిపై రైతుల నుంచి అర్జీలు వస్తున్నాయి. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం

- కె.శ్రీధర్, సంయుక్త సంచాలకులు, వ్యవసాయశాఖ

వరి కోతలకు డబ్బుల్లేవు



ఖరీఫ్‌లో ఈసారి వర్షాల్లేక ఇంజిన్లు, ఇతర ఖర్చుల కోసం అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది. పిఎం కిసాన్ డబ్బులతో కోతలకు మదుపులు పెడుతున్నాను. అవి ఏమాత్రం చాలవు. రైతు భరోసా డబ్బులు వస్తే కొంత ఉపయోగకరంగా ఉంటాయి.

- పండి వాసుదేవరావు, రైతు, రాజపురం



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు

డిసెంబరు 26 నాటికి క్లయిమ్‌లు పూర్తి

- బిఎల్ఎల జాబితాలు అందజేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెల 26వ తేదీ నాటికి ఓటర్ల జాబితాకు సంబంధించిన అన్ని క్లయిమ్‌లను పూర్తి చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని డిఆర్ఒ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో 19వ జిల్లాస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి, టిడిపి మినహా మిగిలిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఎ) జాబితాలను ఇంకా అందజేయలేదని, వాటిని జిల్లా ఎన్నికల అధికారికి త్వరగా అందజేయాలని కోరారు. ఫారం-6, 7, 8కు సంబంధించి జిల్లాలో 10,728 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కొత్తగా 72,711 మంది ఓటర్లుగా నమోదయ్యారని, పాత జాబితాలో 42,020 మందిని తొలగించామని, ఇందులో 22,454 మంది మృతి చెందిన వారున్నారని తెలిపారు. క్లయిమ్‌లను స్వీకరించేందుకు డిసెంబరు తొమ్మిదో తేదీ ఆఖరు అని స్పష్టం చేశారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో క్లయిమ్‌లను స్వీకరించేందుకు ఆయా బూత్‌ల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మార్పులు, చేర్పులతో ఓటర్ల జాబితా ప్రక్రియను వచ్చే నెల 26వ తేదీ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు గోవింద మల్లిబాబు, బిఎస్‌పి నాయకులు సోమేశ్వరరావు, బిజెపి నాయకులు కోరాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శతశాతం ఎన్నికల హామీల అమలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను శత శాతం అమలు చేసిన తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నందివాడ పంచాయతీ నరసాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కొనియాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, సర్పంచ్ మజ్జి శైలజ, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు పి.రమేష్ కుమార్, జి.నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని కొత్తవలసలో టిడిపి, జనసేన ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేస్తూ టిడిపి పాలనకు, ప్రస్తుత వైసిపి పాలనకు తేడా, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విధ్వంసకర పాలనను కొనసాగిస్తూ సైకో ఆనందం పొందుతున్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో వనరుల దోపిడీ, బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగాయని విమర్శించారు. జగన్ రెడ్డి పాలనను ప్రశ్నిస్తే ఎంతటి వారిపైనైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడవడం లేదని, రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. వైసిపి పాలనలో హంగు, ఆర్భాటమే తప్ప ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకో పాలనకు చరమగీతం పాడి, సైకిల్ పాలనను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షులు మెట్ట సుజాత, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, మాజీ సర్పంచ్ జి.మోహనరావు, తమ్మినేని చంద్రశేఖర్, బొడ్డేపల్లి గౌరీపతి, జనసేన నాయకులు వి.బాలమురళీకృష్ణ, మురపాక రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను పంపిణీ చేస్తున్న కూన రవికుమార్

పోరాట స్ఫూర్తి 'పినకాన'

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - నందిగాం

నిర్బంధాలను ఎదురించి, శ్రమజీవుల పక్షాన నికరంగా నిలబడి పోరాటం చేసిన యోధుడు పినకాన కృష్ణమూర్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. పినకాన కృష్ణమూర్తి ఏడో వర్ధంతి సభను మండలంలోని చిన్న లక్ష్మీపురంలో బుధవారం నిర్వహించారు. పినకాన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ ప్రజల కోసం పినకాన తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. తర్లా జమిందారీ భూములపై ఎకరాకు రూ.14.25 శిస్తు విధించడాన్ని వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం చేపట్టారని చెప్పారు. ఆ పోరాట ఫలితంగా ప్రభుత్వం రూ.ఆరుకు శిస్తు తగ్గించిందని తెలిపారు. గిరిజనులకు అటవీ సంపద, హక్కులు, పోడు పట్టాల కోసం అనేక గిరిజన ఉద్యమాలు నడిపారని గుర్తుచేశారు. కార్మిక, రైతాంగ, ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మించాలని రైతాంగాన్ని సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలు చేశారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తుంటే, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. విశ్వసముద్ర పేరుతో జిల్లాలో మైనింగ్‌ని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. కరువు కోరల్లో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయడమే కృష్ణమూర్తికి ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర నాయకులు కె.మోహనరావు, న్యాయవాది పినకాన అజయ్ కుమార్, రైతుసంఘం నాయకులు కోత మధు, కె.ధర్మారావు, పి.సాంబమూర్తి, హెచ్.ఈశ్వరరావు, సిపిఎం టెక్కలి మండల కన్వీనర్ కొల్లి ఎల్లయ్య, పినకాన కుటుంబ సభ్యులు, గిరిజనులు, రైతులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

వ్యవస్థలపై నమ్మకం అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పారాలీగల్ వాలంటీర్లు వ్యవస్థలపై నమ్మకం కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవా సదన్‌లో బుధవారం పారాలీగల్ వాలంటీర్ల రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. వ్యవస్థలపై నమ్మకం ఉన్నప్పుడే ప్రజలకు భరోసా కల్పించగలరని చెప్పారు. వ్యవస్థ అభ్యున్నతికి పాటుపడేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ న్యాయవాది అన్నెపు సత్యనారాయణ కమ్యూనికేషన్ స్కిల్స్, మెట్ట సత్యనారాయణ ఫ్యామిలీ చట్టం, పి.వి.ఎస్ సీతారామయ్య ఆస్తి హక్కు, అన్నెపు భువనేశ్వరరావు క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఆర్.సన్యాసినాయుడు, శ్రీకాకుళంలోని ఇతర కోర్టులు, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, నరసన్నపేట, కోటబొమ్మాళి, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు కోర్టుల నుంచి వర్చువల్‌గా పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆర్‌ఆర్ కాలనీ సిద్ధం

ప్రజాశక్తి - నౌపడ



నౌపడ : ఆర్‌ఆర్ కాలనీని మ్యాపును పరిశీలిస్తున్న జెసి నవీన్

త్వరితగతిన మూలపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీని సిద్ధం చేయించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో నిర్మితమవుతున్న మూలపేట పోర్టు నిర్వాసిత కాలనీ పనులను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. రూ.35 కోట్లతో 55 ఎకరాల్లో నిర్మితమవుతున్న ఆర్‌ఆర్ కాలనీకి ఎర్త్ లెవలింగ్, గ్రావెల్ రోడ్డు పనులు ఎంతవరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి సరఫరా పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. కాలనీలో మౌలిక వసతులు, భవనాలు, పాఠశాలలు ఏర్పాటు వంటి విషయాలు మ్యాప్ ద్వారా అధికారులను అడిగి ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ చలమయ్య, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు స్థల పరిశీలన

వజ్రపుకొత్తూరు : అక్కుపల్లి మత్స్యకార గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం బెండికొండ వద్ద స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ బుధవారం పరిశీలించారు. పాఠశాల కోసం సుమారు 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఎంపిక చేశారు. గురుకుల పాఠశాల ఐదు నుంచి పదో తరగతి వరకు రెండు సెక్షన్లతో ప్రస్తుతం అక్కుపల్లిలోని తుపాను రక్షిత భవనంలో నడుస్తోంది. శాశ్వత భవనం లేకపోవడంతో వసతి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే స్థలం ఎంపిక చేయడంతో జెసి మరో సారి పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ బి.అప్పలస్వామి, డిటి వి.గిరిరాజ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు ఉన్నారు.

వనరుల కేంద్రాలుగా గ్రంథాలయాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు గ్రంథాలయాలను వనరుల కేంద్రాలుగా వినియోగించుకుని విజ్ఞానాన్ని అందుపుచ్చుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని కళాశాలలో గల సెమినార్ హాల్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవ ముగింపు వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మంచి పుస్తకం మంచి స్నేహితునితో సమానమన్నారు. గ్రంథాలయాల ఆవశ్యకత, అవసరాన్ని గురించి వివరించారు. కళాశాల గ్రంథాలయ విభాగం ఇన్‌ఛార్జి పి.లక్ష్మీప్రసన్న భారతి మహిళా డిగ్రీ కళాశాల గ్రంథాలయం విశిష్టత, అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు. వారం రోజుల పాటు పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథి లైబ్రేరియన్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వలసయ్యను ఘనంగా సత్కరించారు. అంతకుముందు లైబ్రేరియన్ సైన్స్ పితామహుడు ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, అకడమిక్ ఇన్‌ఛార్జి చింతాడ కృష్ణారావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఎల్.కృష్ణారావు, చిన్నారావు, జ్యోతిలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టూరిజం యువ క్లబ్‌లో చేరాలి

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు టూరిజం యువ క్లబ్‌లో చేరాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు పిలుపునిచ్చారు. నగరంలోని మెహర్ విద్యానికేతన్‌లో బుధవారం టూరిజం యువ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచ వారసత్వ వారం సందర్భంగా జిల్లాలో వారసత్వ సంపద కలిగిన ప్రదేశాలు, సముద్ర తీరప్రాంతాలు, నదులు, ప్రాచీన కట్టడాలను విద్యార్థులకు వివరించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ ఎం.వి.ఎల్ సుందరి ఆహారపు అలవాట్లు, వ్యాయామం గురించి వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న బాలచంద్రారెడ్డి

పోలీస్‌స్టేషన్లలో వార్షిక తనిఖీలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా కాశీబుగ్గ డిఎస్‌పి జి.నాగేశ్వరరెడ్డి పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఎస్ఐ మధుసూదనరావును పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కేసులు నమోదు, విచారణ ముందుకు సాగడానికి అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈయనతో పాటు సిఐ జి.శంకరరావు ఉన్నారు.

పోలాకి: స్థానిక పోలీస్‌స్టేషన్ లో బుధవారం టెక్కలి సబ్ డివిజన్ డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డివార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ రికార్డులు, నమోదు చేసిన కేసుల సంఖ్య, వివరాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. ఏవైనా జటిలమైన కేసులు కేసులు ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ వి.సత్యనారాయణ, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అప్పలరాజు విజయం ఖాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విజయం ఖాయమని మండల వైసిపి అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి నాయకులు మంత్రిపై ఎన్ని విమర్శలు గుప్పించినా ప్రజల నుంచి స్పందన రాలేదు అన్నారు. మత్స్యకార మంత్రిపై మాజీ కొల్లు రవీంద్ర అవాకులు, చవాకులు మానుకొని హుందాగా ఉంటే సరిపో యేదన్నారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార భరోసా రూ.4 నుంచి రూ.10 వేలు పెంచారని అన్నారు. జిల్లాకు పోర్టు నిర్మాణం నిర్ణయం వెనుక మంత్రి డాక్టర్ అప్పలరాజు కృషి ఉందని గుర్తుంచుకోవాలన్నారు. మత్స్యకార సమస్యలు కోసం కనీస అవగాహన లేని జనసేన నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పెద్దబొడ్డపాడులో టిడిపి చేరికలు కావని, అవి ఆ పార్టీ రెన్యూవల్స్ అన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి వంక రాజు, మండల విప్ తిర్రి రాజారావు, సచివాలయ కో-ఆర్డినేటర్ వడ్డి కరుణాకర్, సర్పంచ్‌లు వంక చిరంజీవిరావు, ముువ్వల ఎర్రా, ఎంపిటిసి వెంకన్న పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం

కొత్తూరు : ఇంటి పనులు వసూలు వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ వి.రమణ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో 43 మంది పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను వసూలు ఆన్‌లైన్‌లో ఎలా వసూలు చేయాలన్నదానిపై పలు సూచనలు చేశారు. ఈయనతో పాటు మండల విస్తరణ అధికారి కృష్ణారావు ఉన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

- సేవలందక ఇక్కట్లు పడుతున్న ప్రజలు
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు మేలు చేయాలని సంకల్పిస్తే సచివాలయ ఉద్యోగుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని పలువురు వాపోతున్నారు. మండలంలోని బెలమాం గ్రామ పంచాయతీలో ఉన్న సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం వలన బెలమాం, లొద్దలపేట గ్రామ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఈ


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సచివాలయం మండల కేంద్రానికి నాగావళి నది అవతల వైపు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించకుండా వారికి తీరిక వేళల్లో వచ్చి ముఖం చూపెడుతూ వెళ్లిపోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి సెలవులో ఉండడంతో దూసి డిడిఒకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ పట్టించుకోకపోవడంతో వీరు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా విధులను నిర్వహిస్తున్నారని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. సచివాలయాలు వచ్చాక గ్రామంలోనే తమ పనులు సులభంగా పూర్తవుతాయని అనుకున్నామని, నేడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సచివాలయ ఉద్యోగుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సచివాలయం ద్వారా సక్రమంగా ప్రజల పనులు పూర్తయ్యేటట్లు దృష్టి సారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సృజన సత్తా


సృజన

సోంపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన చేపట్టిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో సోంపేట సంస్కార భారతి కళాశాలకు చెందిన బొడ్డ సృజన సత్తా చాటింది. డిగ్రీ చదువుతున్న సృజన రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి, తెలుగు మీడియం కేటగిరిలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఇంతటి ఘన విజయం సాధించడంపై కళాశాల యాజమాన్యం అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణభారతి హవా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇటీవల నిర్వహించిన 4వ సెమిస్టర్ ఫలితాల్లో ఇచ్ఛాపురానికి చెందిన స్వర్ణభారతి డిగ్రీ విద్యార్థులు తమ హవా కొనసాగించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో వలపల దుర్గాభవాని ఎంపిసిఎస్ గ్రూపులో 9.4 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచింది. 9.0 పాయింట్లతో డి.పూజ రెండో స్థానంలో నిలిచింది. తమ కళాశాలలోని అన్ని గ్రూపులకు చెందిన 75 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాసురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సందీప్, జయప్రకాష్, అధ్యాపకులు అభినందించారు. అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ రోభిన్ కుమార్ పాడి అభినందించారు. గుడియ జ్యోతి 9.53. తెన్నేటి శ్రీజ 9.14, ఆసీ శిరీష, 8.94, లిమాయి స్నేహ 8.05 పాయింట్లు సాధించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జెన్న దుర్యోధన, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, దేవరాజు, వరప్రసాద్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న తులసీదాస్‌రెడ్డి

అంగన్వాడీల సమ్మె నోటీసు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీల వేతనాలు పెంచాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ డిసెంబర్ 8 నుంచి నిరవధికంగా జరిగే సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సిడిపిఒ ఎస్.గీతకు కార్యాలయంలో సెక్టార్ పరిధిలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు అలాగే బూర్జ అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు 2022 సంవత్సరంలోనే గ్రాడ్యూటీ చెల్లించాలని తీర్పు ఇచ్చినప్పటికీ నేటికీ అమలు చేయడం లేదని వెంటనే అమలు చేయాలని కోరారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చి మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌ను రూ.5 లక్షలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్‌గా ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించి రాజకీయ జోక్యాన్ని అరికట్టి పదోన్నతి వయస్సును 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉండి చనిపోయిన


సిడిపిఒకు సమ్మె నోటీసును అందజేస్తున్న లతాదేవి

అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమాను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, బకాయి పడిన సెంటర్ 2017 నుంచి టిఎ బిల్లులు, ఇతర బకాయిలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా సహాయ కార్యదర్శి పంచాది లతా దేవి, ప్రాజెక్టు కార్యదర్శి పి. భూలక్ష్మి, మొదలవలస లత, పి. లక్ష్మి, డి.రమాదేవి, జి.అనురాధ, లక్ష్మి, కళావతి, ఎస్.రవణమ్మ కె.జ్యోతి పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులపై సమీక్ష


టెక్కలి రూరల్ : సమీక్షిస్తున్న పీడీ శాంతిశ్రీ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అంగన్వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పనుల్లో భాగంగా మరమ్మతు పనులు వేగవంతం చేయాలని ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ సూచించారు. మండలంలోని కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఐసిడిఎస్ డివిజన్ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. డివిజన్‌లోని టెక్కలి, కోటబొమ్మాళి, కొత్తూరు, పాతపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, పిఆర్ఎఇలతో సమీక్షించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ సెక్టార్‌లోని నౌపడ 1, 2 అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మెనూ, హాజరు పౌష్టికాహారం అందజేత రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బరువు తక్కువ కలిగిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్వాడీలకు సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా అందజేస్తున్నారని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నీలావతి గేటు సమీపం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దనీలావతికి చెందిన బొంగు సుందరరావు (37), మిన్నారావు (40) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దనీలావతికి చెందిన బొంగు సుందరరావు, మిన్నారావులు కలిసి కాశీబుగ్గ వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నీలావతి రైల్వే గేటు సమీపం జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఇద్దరూ లారీ చక్రాలు కింద పడిపోవడంతో నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు ఛిద్రమయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు చేరిని మృతదేహాలు వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మిన్నారావు పదేళ్ల క్రితం ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి వలస వచ్చి తాపీమేస్త్రి పనులు చేస్తూ పెద్ద నీలావతికి చెందిన సొర్రా వనజాక్షిని వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి పెద్దనీలావతిలోనే నివాసం ఉంటున్నాడు. మృతుడికి కుమార్తె ఉన్నారు. సుందరరావు బొంగుసుందరరావులో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుందరరావుకు భార్య గీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నాటుసారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

నాటుసారాతో పట్టుబడిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం సరుబుజ్జిలి మండలంలోని పెద్ద సవళాపురం జంక్షన్ వద్ద ఎపి35ఎసి 6929 బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనం మీద వస్తున్న అదే మండలం చిగురువలస గ్రామానికి చెందిన దానాల వినోద్‌ను 20 లీటర్ల నాటు సారా రవాణా చేస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. అదే వాహనంపై ఉన్న దానాల రాము తప్పించుకొని పారిపోయాడని తెలిపారు. దానాల వినోద్‌పై కేసునమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది వైకుంఠరావు, హేమ సుందర్, పి. సత్యనారాయణ పాల్గొన్నారు.


రోడ్డుకు అడ్డంగా పడిన గ్రానైట్ రాయి

తప్పిన ప్రమాదం

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గ్రానైట్ క్వారీ నుంచి అతిపెద్ద బండరాలను లారీపై పాలీస్ గ్రానైట్ ఫ్యాక్టరీకు తరలిస్తున్నారు. ఇంతలో భారీ బండరాయి రహదారిపై పడింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని వాహనదారులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో రోడ్డుపై పడి ఉన్న రాయిని తొలగించారు.

కిడ్నీ వ్యాధితో డీలరు మృతి


మోహనరావు (ఫైల్)

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కిడ్నీ వ్యాధితో పల్లిసారథి చౌక డిపో డీలర్ బెలమల మోహనరావు (52) బుధవారం మృతి చెందారు. మృతునికి కిడ్నీ వ్యాధి బయటపడి సుమారు మూడు నెలలు అవుతుందని భార్య విజయ తెలిపారు. కొన్ని రోజులుగా విశాఖ పట్నంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపింది. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబానికి తహశీల్దార్ బి.అప్పలస్వామి, డిటి గిరి రాజు, డీలర్ సంఘ ప్రతినిధులు కోనేరు కామేశ్వరరావు, తవిటయ్య సంతాపం తెలియజేశారు.

బస్సులో గర్భిణి ప్రసవం

వైద్య సేవలందించిన స్టాఫ్‌నర్సు



ప్రజాశక్తి- పలాస

నిండు గర్భిణి బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో మార్గంమధ్యలో ప్రసవ నొప్పులు రావడం ఆమె అనుభవిస్తుంది. గర్భిణి బాధను గమనించి అదే బస్సులో ప్రయాణిస్తున్న మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన స్టాఫ్‌నర్స్ వనజాక్షి గర్భిణికి సపర్యాలు అందించి బస్సులోనే సుఖ ప్రసవానికి కారకురాలై రెండు నిండు ప్రాణాలను కాపాడింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ఆర్‌టిసి బస్సులో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుర్లాం గ్రామానికి చెందిన బి.జమునరెడ్డికి ప్రయాణిస్తుంది. మార్గంమధ్యలో నొప్పులు రావడంతో తల్లడిల్లిపోయింది. రిమ్స్‌లో శిక్షణ పొందుతున్న స్టాఫనర్సు వనజాక్షి గర్భిణి పరిస్థితిని గమనించి బస్సులో ఉన్న ప్రయాణికులను బయటకు పంపించి వైద్యం అందించింది. దీంతో గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం 108లో తల్లీబిడ్డను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బస్సులో ఉన్న ప్రయాణికులతో పాటు జమునరెడ్డి కుటుంబీకులు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి స్టాఫ్‌నర్స్‌ను అభినందించారు.

ఘనంగా గణిత దినోత్సవం

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల లో బుధవారం ఘనంగా గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా లక్కోజు సంజీవరాయ శర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం కొయ్యల శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయులు ఎ.ఈశ్వరరావు, డి.జనార్ధనరావు, బి.కిషోర్ పాల్గొన్నారు.


కవిటి : మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి

బాల్య వివాహాలు నేరం

కవిటి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిపై తప్పనిసరిగా నిఘా వేయాలని ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ పి.శేఖర్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి బాల్య వివాహాల కమిటీ సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలు, భవిష్యత్‌లో ఎదుర్కోబోయే సమస్యలు గ్రామస్థాయిలో తెలియజేయాలని మహిళా పోలీసులకు సూచించారు. పంచాయతీ పరిధిలో బాల్యవివాహాల కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, సిడిపిఒ పి.నాగారాణి, సూపర్ వైజర్లు జి.కృష్ణవేణి, పి.పల్లవి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో 13,14, 16,17 వార్డుల్లో బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. 12, 13, 14 వార్డుల్లో చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. 16, 17 వార్డుల్లో నిర్వహించిన సదస్సులో వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ఉమెన్ ప్రొటెక్షన్ గీతారాణి, ఎఎన్ఎం ఎర్రమ్మ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని అది సాధించేందుకు అలుపెరగని కృషి చేయాలని వైసిపి సిఇసి సభ్యులు ధర్మాన పద్మాప్రియ అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక స్వచ్ఛంద సంస్థ ఎస్‌విసిటి, భవిష్యత్ ట్రస్టులు కలిసి కెరీర్ ఫేర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ ఉపయోగపడేవిధంగా విభిన్న విభాగాల నుంచి మేధావులను తెచ్చి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఎస్‌విసిటి ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, చింతు రామారావు, రాజపు అప్పన్న, కోరాడ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మావతి

చంద్రభూషణ గుప్త, ప్రిన్సిపాల్ నారాయణస్వామి, ఆర్ఐఒ దుర్గారావు, డిఇఒ వెంకటేశ్వరరావు, నివల్ కామండర్ కె.ఎల్.రావు, జెమ్స్ ప్రొఫెసర్ ఆర్.అరవింద్, భవిష్యత్ సిఇఒ విజయకృష్ణ, డాక్టర్ గోలివి మోహన్, ఎస్‌విసిటి ప్రతినిధులు, కె.రవీంద్రనాథ్, డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ జ్యోతిఫ్రెడరిక్ పాల్గొన్నారు.


పోస్టర్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

చంద్రబాబుతోనే సంక్షేమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో 9వ డివిజన్ పరిధిలో బొంపాడ వీధిలో బాబు ష్యూరిటీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నగర టిడిపి అధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హాజరై మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో పేదప్రజలకు అన్ని విధాలా ఆదుకున్నామని, గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం ధరలు పెంచి సామాన్యులకు బతుకు తెరువు లేకుండా చేశారని విమర్శించారు. పథకాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునే వైసిపి నాయకులు నెలకు ఎంత ఇస్తున్నారు, దొడ్డిదారిన ఎంత లాగేస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, డివిజన్ ఇన్‌ఛార్జి గండేపల్లి కోటేశ్వరరావు భవాని, మధు, జి.జ్యోతి, గోవింద, చిన్న పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: టిడిపి అధినేత చంద్రబాబును ఎన్నికలు పూర్తయ్యేవరకు జైలుకే పరిమితం చేయాలన్న వైసిపి కుట్రలు సాగలేదని టెక్కలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పూజారి శైలజ వ్యాఖ్యానించారు. మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ పరిధిలోని చిన్నహరిశ్చంద్రపురం, వింజాంపాడు తదితర గ్రామాల్లో బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోకు సంబంధించిన పోస్టర్లను పంపిణీ చేశారు. వైసిపి పాలనలో నిత్యావసర ధరలు, ఇసుక, సిమెంట్, బస్సు, విద్యుత్ ఛార్జీలను పెంచుతూ దోపిడీ పాలనను సాగిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొడ్డేపల్లి మోహన్, హనుమంతు సూర్యనారాయణ, హనుమంతు శేషగిరి, హనుమంతు అప్పన్న, గురువెల్లి ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే మండలం తిలారు పంచాయతీలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ ఆధ్వర్యాన బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఎంజి పురం కాలనీ నుంచి కొనక గ్రామం వరకు రూ.4 కోట్లు ఐటిడిఎ నిధులతో నూతనంగా నిర్మించనున్న తారురోడ్డుకు జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో గ్రామాల అభివృద్ధికి సిఎం జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, వైసిపి నాయకులు ఇప్పిలి కృష్ణారావు,


శంకుస్థాపన చేస్తున్న విజయ, రామారావు

ఎఎంసి చైర్మన్ బతకల మోహనరావు, పిఎసిఎస్ అధ్యక్షులు రౌతు విశ్వనాథం, కో-ఆప్షన్ మెంబర్ బినోద్ కుమార్ పండా, సర్పంచ్ సకల భక్తుల హరీష్, ఉత్తరాల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

సిలబస్ పూర్తికి కృషి

కొత్తూరు : మండలంలోని పాఠశాలల్లో సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని ఎంఇఒలు గోవిందరావు, శ్రీనివాసరావులు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో వార్షిక పాఠశాల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్క్, నోట్ బుక్స్‌ను తరచూ పరిశీలించాలన్నారు. మౌలిక వసతులు, ఐఎఫ్‌ఐపి స్మార్ట్ టివి, బైజ్యూస్ ట్యాబ్స్ విద్యార్థులు వినియోగించేలా రోజూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గోవిందరావు, డి.ఎల్.నర్సింహం పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

కార్మిక, కర్షక, ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో జరిగే 30 గంటల మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు పిలుపునిచ్చారు. మండలంలోని తొలుసూరుపల్లి రోడ్డులో ఉన్న ఎఐటియుసి కార్యాలయం ఆవరణలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలన్నింటికీ మద్దతు ధర కల్పించాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంట రుణాలు అందించాలన్నారు. కరువు ప్రాంత రైతులకు పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. పంట రుణాలు రద్దు చేయాలన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ ద్వారా 200 రోజులు పనులు కల్పించి, రూ.600లు కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు తమిరి భుజంగరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల పోలారావు, రవి, యువజన సమైఖ్య నాయకులు ప్రభుదేవ్ బెహరా, చింతలగార భూపోరాట నాయకులు తిర్లంగి రాజేష్, బమ్మిడి వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

దోపిడీ పాలన అంతమొందించడానికి సమరశీల ప్రజా పోరాటాలు సాగించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వై.కొండయ్య అన్నారు. బుధవారం మర్రిపాడు అమరవీరుల స్మారక స్థూపం వద్ద 45వ స్మారక సభ జరిగింది. సమసమాజ నిర్మాణం కోసం భారత విప్లవ ఉద్యమ నిర్మాణంలో అసువులు బాసిన అమరవీరులు అందరికీ నివాళ్లర్పించారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి ఆశయాల వెలుగులో నడవాలన్నారు. కేంద్రంలో నియంత మోడీ పాలనకు జగన్ వంత పాడుతున్నారని మండిపడ్డారు. విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి ముందుగా విప్లవ జెండాను ఎగురవేసారు. జిల్లా కమిటీ సభ్యులు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పిఒడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, కుత్తుం వినోద్, ఉత్తరాంధ్ర మహిళా సంఘం గౌరవ అధ్యక్షులు పి. అరుణ,


మాట్లాడుతున్న సురేఖ

ప్రజాకళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. నీలకంఠం, రాపాక మాధవరావు, నేతింటి నీలంరాజు, కుత్తుం హేమ, పోతనపల్లి మల్లేశ్వరరావు, రచయితలు నిశతాసి, బద్రి కూర్మారావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

9న కోటి దీపారాధన

లావేరు: కార్తీకమాసం సందర్భంగా బెజ్జిపురం గ్రామంలో కోటి దీపారాధన మహోత్సవం నిర్వహించడానికి ముందస్తు ప్రణాళికలు కొరకు శ్రీఉమా రామలింగేశ్వర దేవాలయం వద్ద కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించారు. దాతల ఆర్థికసాయంతో డిసెంబరు 9న గ్రామంలో ప్రతిఇంటి వద్ద, ఆలయాల వద్ద కోటి దీపారాధన చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో మేడూరి ప్రసాదరావు, ఇజ్జాడ శ్రీనివాసరావు, దన్నాన రాజినాయుడు, కలిశెట్టి వెంకటరమణ (పైడితల్లి), పెద్దింటి లక్ష్మణరావు, పిన్నింటి మధుబాబు, పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

సంతబొమ్మాళి: మండలంలోని ఉమిలాడ రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు (గోవింద్) బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ రామరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న జగన్నాయకులు

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో అరసవల్లి జంక్షన్‌లో ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ధనలక్ష్మి బ్యాంకు అరసవల్లి బ్రాంచిలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తు న్నట్టు బ్యాంకు మేనేజరు ఎం.తాతారావు ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక, ఆర్థరైటిస్, శ్వాస సంబంధిత సమస్యలు, డయాబెటీస్, చర్మ సంబంధిత సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం



బూర్జ : జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపిపి తదితరులు

ప్రజాశక్తి- బూర్జ

ప్రజలు అనేక ప్రభుత్వాలను చూశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందజేసే ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే ఉందని ఎంపిపి కర్నేన దీప అన్నారు. బుధవారం పాలవలస గ్రామంలో వై నీడ్ జగన్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన, హరిజన గ్రామాల్లో అభివృద్ధి చేసి ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసిందన్నారు. దీనిని ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, డిసిఎంఎస్ మెంబర్ జల్లు బలరాం నాయుడు, ఎఎంసి మాజీ అధ్యక్షులు రాంబాబు, మాజీ సర్పంచ్ అప్పలస్వామి నాయుడు, సర్పంచ్‌లు వి.కృష్ణమోహన్, అంబుజాక్షి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మున్సిపాలిటీలో 5,6,11 వార్డుల్లో వై ఎపికి నీడ్ జగన్ కార్యాక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద వివిధ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును చూపించారు. అనంతరం వైసిపి పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లి రమేష్, టౌన్ ప్రెసిడెంట్ పట్నాయక్, జెసిఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీ, వార్డు కౌన్సిలర్ పరపతి మంజులత, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, నీలపు ఢిల్లీ, కిరణ్, షఫీ, కోటి పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని లోనిజోడూరు గ్రామ సచివాలయం పరిధిలో ఎంపిడిఒ బి.చంద్రకుమారి అధ్యక్షతన ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ బెజ్జిపల్లి సరోజిని, కూర్మారావు, కరణం శశిభూషణరావు, శ్రీనివాసరావు, ప్రకాష్, సంజీవరావు, విఆర్‌ఒ పాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాట తప్పని సిఎం జగన్

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో ప్రజల సమస్యలపై నిరంతరం ఆలోచన చేస్తూ ఇచ్చిన హామీలను శతశాతం పూర్తి చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు పేర్కొన్నారు. నగరంలోని గుజరాతీపేటలో జగనే ఎందుకు కావాలంటే పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం ఆయన హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ ప్రచారం నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నది లేనిది చెప్పాలన్నారు. కార్యక్రమంలో అందవరపు సంతోష్, చౌదరి సతీష్, కామేశ్వరి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న విజయ, రామారావు



గృహాలను సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బూర్జలో గృహాల సర్వే

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో బుధవారం రెవెన్యూశాఖ అధికారులు గృహాలను సర్వే చేపట్టారు. దశాబ్దాల కాలంగా ఆ గహాల్లో నివాసం ఉన్నప్పటికీ, హక్కుదారులు అయినప్పటికీ, వారికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సిఎం జగన్మోహన్ రెడ్డి సర్వేకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి అర్హులైన వారికి పట్టాలను అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కార్యదర్శి బలివాడ కిరణ్ కుమార్ గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఆయనతో పాటు విఆర్‌ఒ అప్పలనాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు వితరణ

వజ్రపుకొత్తూరు : మణ్డలంలోని అక్కుపల్లి మత్స్యకార గురుకుల పాఠశాలకు విశ్రాంత ఉద్యోగి కాస సోమశేఖర్ బుధవారం ఆట వస్తువులు, కుర్చీలు ప్రిన్సిపాల్ ఎం.పాపారావుకు అందజేశారు. విద్యార్థులు క్రీడా పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల అవసరాలు గుర్తించి వితరణగా అందించడానికి ముందుకు వస్తున్న స్థానికులను ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని బుధవారం విశాఖపట్నం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి మాధవి కుటుంబ సభ్యలతో కలసి సందర్శించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు.

భరత్‌చంద్రకు అభినందనలు

ఇచ్ఛాపురం : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థి బి.భరత్‌చంద్ర ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నెల అక్టోబరులో జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 బాలురు షాట్‌పుట్ విభాగంలో 11.35 సెంటీమీటర్లు విసిరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదే నెల 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేట డిఎస్‌ఎ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈయనకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సరోజని, ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- పలాస

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి పిలుపునిచ్చారు. మండలంలోని శాసనం ఎంపిపి పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు బెండి నాగమణి ఆధ్వర్యాన గ్రీన్‌ఆర్మీ సౌజన్యంతో బాదం, కదంబ, అశోక, జామి, ఉసిరిక మొక్కలను బుధవారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం నివారణకు చిన్న తనము నుంచే మొక్కలు నాటే అలవాటు అలవర్చుకొవాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్, మున్సిపల్ సానిటరీ, ఎన్విరాన్మెంటల్ సెక్రెటరీ ఉదయ్‌శంకర్ పాత్రో, దాసరి వైకుంఠరావు, కొల్లి నారాయణరావు, గ్రీన్ ఆర్మీ సభ్యులు హుస్సేన్ ఉపాధ్యాయులు డి.శ్రీదేవి, బి.వరప్రసాద్, బి.ఇంద్రతనయ, జి.వి.రమణ, ఎ.షణ్ముఖరావు, డి.ఉషారాణి పాల్గొన్నారు.



కోళ్లఫారాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

మదర్ ఫౌల్ట్రీ సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం కనుగులవానిపేట గ్రామంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యాన మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఫౌల్ట్రీ ఫారాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ డి.వి.విద్యాసాగర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరటికోళ్ల పెంపకం ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని సూచించారు. గతంలో పెరటికోళ్లను విశాఖ నుంచి జిల్లాకు సరఫరా చేసే వారని, కానీ ఇప్పుడు మహిళలు వీటి పెంపకంలో తగిన శిక్షణ పొందడం వలన స్థానికంగా ఈ పెంపకానికి అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, రణస్థలం, పాతపట్నంలో ఫైలట్ ప్రాజెక్టు ప్రారంభించినట్టు తెలిపారు. ఇతర మహిళా సంఘాలు ముందుకొస్తే వారికి కూడా కోళ్ల పెంపకంలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్శనలో ఎడి ఎం.సన్యాసిరావు, ఎసి కొండలరావు, ఎపిఎం, ఇతర మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏదీ?

సంతబొమ్మాళి : నవంబరు 7న రైతుభరోసా అని చెప్పి సిఎం జగన్ బటన్ నొక్కారు కానీ, మండలంలో ఇప్పటి వరకు ఏ రైతుకూ ఒక్క రూపాయి పడకపోవడం హాస్యాస్పదమని మండల టిడిపి అధ్యక్షులు జీరు భీమారావు ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. మడలంలోని మర్రిపాడు, మేఘవరం, మరువాడ, లింగూడు, భావనపాడు, మలగాం పంచాయతీల్లో 50 శాతం వరి పంట పోయిందని అన్నారు. అందుకు ఈ పంచాయతీలను కరువు పంచాయతీలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రబీ పంటకు రాయితీపై విత్తనాలు, ఇన్స్యూరెన్స్ అందజేసి తక్షణమే ఆదుకోవాలన్నారు. ఈయన వెంట మండల మత్స్యకారులు నాయకులు సూరాడ ధనరాజు, కర్రి రామిరెడ్డి, సార సవరయ్య, జీరు రామారావు ఉన్నారు.



మాట్లాడుతున్న భీమారావు

నాయకుల పరామర్శ

పోలాకి: మండలంలో ఇటీవల ప్రమాదానికి గురైన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం పరామర్శించారు. ముందుగా బెలమర పాలవలస గ్రామం మాజీ సర్పంచ్ చింతు యండువాడును, జరాంపురం ఎంపిటిసి మాజీ సభ్యులు కొమర యర్రయ్యను అంబీర్‌పేటకు చెందిన పోతల మల్లమ్మ, పట్ట అప్పమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట వైసిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, సీనియర్ నాయకులు భైరి భాస్కరరావు, లూకాలపు రాంబాబు, మైలపల్లి త్రినాథ్, బి.సింహాద్రి, ఉప్పాడ అప్పలరెడ్డి, కోనేటి మోహనరావు, పూడి కూర్మారావు, భగీరథ ఉన్నారు.

దువ్వాడ వాణి...

టెక్కలి రూరల్ : మండలంలో చాకిపల్లి మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ చుక్కగున్నమ్మ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి పరామర్శించారు. ఈమెతో పాటు సర్పంచ్ వాన తవిటయ్య, ఎంపిటిసి ప్రతినిధి శ్రీనివాసరావు ఉన్నారు.

తేజేశ్వరరావు...

మెళియాపుట్టి: మండలంలో పెద్ద పద్మాపురం ఉర్లాన సూరి సూర్యనారాయణ కుటుంబ సభ్యులను విశ్రాంత ఉపాధ్యాయులు లింగాల సంజీవ రావులను విద్యావేత్త సిరిపురపు తేజేశ్వరరావు పరామర్శించారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ పడాల రాజారావు, గణపతి, శ్రీరాములు, మోహన్, శ్యామ్, కిషోర్, ధనుంజయ ఉన్నారు.

24న టిడిపి దళిత శంఖారావం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్లలో దళితులపై వైసిపి నాయకులు దమన కాండను సాగిస్తూ హత్యలు, అత్యాచారాలు, దాడులకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ పెద్దల ప్రేరణ తోనే ఈదాష్టీకం కొనసాగుతుందని టిడిపి ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా పురుషోత్తం, గోర సురేష్‌లు ఆరోపించారు. బుధవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ దమనకాండను నిరశిస్తూ ఈ నెల 24న నగరంలో పెద్దఎత్తున దళిత ప్రజలను సమీకరించి శంఖారావం పేరుతో సభ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. దళిత వ్యతిరేకి జగన్మోహనరెడ్డి అని, న్యాయం అడిగితే గొంతు నొక్కే ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆరోపించారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి నివాళ్లర్పించి అక్కడినుంచి ఏడురోడ్ల కూడలివద్దకు చేరుకుంటుందన్నారు. ఈ సభలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజ రాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, జిల్లా పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్, ఎస్‌సిసెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, రాష్ట్ర ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమణ మాదిగ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి బోనెల అప్పారావు, అరకు పార్లమెంటరీ పార్టీ ఎస్‌సిసెల్ ప్రధాన కార్యదర్శి సవలాపురపు భాస్కరరావు, టిడిపి నాయకులు కొవ్వాడ సుశీల, బందిలీపురపు ఆశీరమ్మ, కొమర కమల, కొత్తపల్లి సింహాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తం

కోటబొమ్మాళి: ఈ నెల 24న జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్‌సి సెల్ ఆధ్వర్యాన శ్రీకాకుళంలో నిర్వహించనున్న దళిత శంఖారావం సభను విజయవంతం చేయాలని ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు దువ్వారపు సింహాచలం పిలుపనిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో దళితులపై దమనకాండకు నిరసనగా దళిత శంఖారావం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల దళిత నేతలు దేవాది సింహాద్రమ్మ, బోర అప్పారావు, ఉర్జాన కొండలరావు, ఉర్జాన రాము పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజా సంక్షేమం

టెక్కలి రూరల్ : అర్హులైతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి అన్నారు. తొలుసూరుపల్లి పంచాయతీ సైనికనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు, దువ్వాడ హైందవి మోహన్, ఎంపిపి ప్రతినిధి అట్లా రాహుల్, సర్పంచ్ ప్రతినిధి బగాది రామకృష్ణ, ఎంపిటిసి ప్రతినిధి చింతాడ అప్పన్న, వంబరవల్లి ధర్మరాజు, బమ్మిడి అప్పన్న, బమ్మిడి చిన్నారావు, తిర్లంగి అప్పన్న పాల్గొన్నారు.